# లింగాపుట్టులో ఫలించిన కల

పాడేరు పట్టణం: మన్యంలో పరిచయం అవసరం లేని గ్రామం లింగాపుట్టు. ఈ గ్రామంలో గతేడాది సీజన్లో నెలరోజుల వ్యవధిలో 21 మంది గిరిజనులు వ్యాధులతో మృత్యువాత పడ్డారు. దీనంతటికి కారణం కేవలం కలుషిత తాగునీరేనని అధికార యంత్రాంగం ముక్తకంఠంతో పేర్కొంది. నివారణ చర్యలకు దిగిన ప్రభుత్వం అప్పటికప్పుడు రెండు తాగునీటి బోర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసింది. గ్రామంలో పర్యటించిన శాసనసభా కమిటీ సభ్యులు శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారుల్ని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ఇంజినీరింగ్ అధికారులు గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. గ్రామ సమీపంలో ఉన్న కొండపై నుంచి గొట్టాల ద్వారా నీటిని తీసుకొచ్చి శుద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. అంచనాలు రూపొందించి జిల్లా అధికారులకు పంపారు. 12వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రూ.9.5 లక్షలు కేటాయింటంతో యుద్ధ ప్రాతిపదికన గ్రావిటీ పథకం నిర్మాణ పనులు పూర్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన రూరల్ ఎకనామికల్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు అందించిన కలుషిత నీటిని సైతం శుద్ధి చేసే రూ.3.5 లక్షలు విలువైన అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఫిల్టర్లు అదనంగా ఈ గ్రావిటీ స్కీంకు బిగించారు. మంగళవారం గ్రామంలో గిరిజనులకు ఫిల్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. మండల ఇంజినీరింగ్ అధికారి జేవీ సత్యనారాయణ పనితీరును వివరించారు. గ్రావిటీ స్కీం ద్వారా వచ్చే సురక్షిత తాగునీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. మన్యంలో విద్యుత్తు వినియోగించకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగాత్మకంగా నిర్మించిన గ్రావిటీ స్కీం ఇదేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎకనామికల్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి పవన్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.



ఫిల్టర్ల వినియోగంపై వివరిస్తున్న ఇంజినీరింగ్ అధికారి